నారుమడి పనులతో రైతులు బిజీబిజీ

- అడప దడపా కురుస్తున్న వర్షాలు
- 3105 హెక్టార్లలో వరి సాగవుతుందని అంచనా

పెదవేగి: గత కొద్ది రోజులుగా అడపా దడపా కురిసిన కొద్దిపాటి వర్షాలతో ఖరీఫ్ వరి సాగు చేసే రైతులు నారుమడులు పోసే పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా పెదవేగి పరిధిలో ఈ ఏడాది 3105 హెక్టార్లలో వరి సాగు అవుతుంటే, ప్రస్తుతం 100 హెక్టార్లలో పూర్తయ్యాయి. దెందులూరు 7500 హెక్టార్లు సాగవుతుండగా, నేటికి 371 పూర్తయ్యాయి. పెదపాడు మండలంలో 7 వేల హెక్టార్ల ఖరీఫ్ సాగులో 333 హెక్టార్ల నారుమడి పూర్తయింది. ఏలూరు రూరల్ 3500 హెక్టార్లు సాగవుతుండగా, ప్రస్తుతం 152 హెక్టార్లలో నారుమడులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఎకరం విస్తీర్ణం భూమికి అవసరమైన నారు కోసం 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేస్తున్నారు. జూన్‌లో సాధారణ వర్షం 211 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవాల్సి ఉండగా, 122.4 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. ఈ ప్రాంతంలో ముఖ్యంగా 1318, స్వర్ణలో నాలుగు రకాల విత్తనాలు వినియోగించడంతో పాటు, 1061, 1001, పీఎల్‌ఏ 1100, ఎంటియు, 7029, ఎంటియు 1010, వరి విత్తనాలను వినియోగిస్తున్నారు. నారుమడుల కోసం దున్ని భూమిని చదును చేసి, పాయలుగా విడదీసిన అనంతరం విత్తనాలను వెదజల్లుతున్నారు. విత్తనాలను వెదజల్లేందుకు ముందు నారుమడిని రెండు లేక మూడు పర్యాయాలు దమ్ము చేసిన అనంతరం రైతులు చదును చేస్తున్నారు. మడిని పాయలుగా విడదీసి విత్తనాలు వెదజల్లుతున్నారు.


వరి పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు

విత్తన శుద్ధి తప్పనిసరి

వరి నారుమడులు పోసే రైతులు తప్పని సరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. దీని వలన పంటకు అగ్గితెగులు సోకే అవకాశం ఉండదు. ఒక లీటరు నీటిలో 5 గ్రాముల ట్రైకోడెర్మావిర్డీని లేదా సుడోమోనార్స్‌ను కలిపి విత్తన శుద్ధి చేయాలని ఏఓ శ్రీనివాసరావు తెలిపారు.

విత్తనాలను మొలక కట్టాలి

వరి విత్తనాలను చల్లే ముందుగా మొలక కట్టి మొలక శాతం పరీక్షించాల్సి ఉంది. లేని పక్షంలో రైతులు నష్టపోయో అవకాశం ఉంది. ఎకరాకు అవసరమైన నారు కోసం 5 సెంట్ల భూమిలో 20 నుంచి 25 కేజీల విత్తనాలను చల్లుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


ముండూరులో వేసిన నారుమడి

జింక్, ఐరన్ లోప నివారణ చర్యలు తీసుకోవాలి

వరి నారుమడి పోసిన తరువాత 15 రోజుల్లో జింక్, ఐరన్ లోప నివారణ చర్యలు తీసుకోవాలి. దీని కోసం రెండు శాతం జింక్ సల్ఫేట్, అన్నభేది నిమ్మ ఉప్పును పిచికారీ చేయాలి. నారుమడిలో నీరు పెట్టడానికి, తొలగించడానికి అనువుగా కాలువలు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు.

25 రోజుల తరువాతే నాటాలి

నారు పోసిన 25రోజుల తరువాతే నాటు వేసుకోవాలి. కాండం తొలుచు పురుగు, ఆకు తొలుచు పురుగు నివారణ కోసం నాట్లు వేసేందుకు నారు పీకేందుకు ముందుగా మడిలో సెంటుకి 200 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లాలి.

– సీహెచ్ శ్రీనివాసరావు, ఏవో, పెదవేగి

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు


విద్యార్థులకు దంత సంరక్షణ గురించి వివరిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థినీ విద్యార్థులు దంత సంరక్షణకు వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ డాక్టర్ ప్రసాద్ అన్నారు. సోమవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.శర్మ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు చేశారు. పరీక్ష అనంతరం మందులు అందజేసి, దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

దోమల వృద్ధిని అరికట్టాలి

పెదపాడు: దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. వట్లూరు గ్రామంలో జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా జ్వరాలు, ఇతర అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమకాటు కంటికి కనిపించదని దాని ద్వారా పెనుముప్పు వచ్చే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చక్రధర్, డాక్టర్ అనంత పాల్, డాక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతిని నిర్వహించాలి


టూరింగుపేటలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి రంగులు వేయించిన దృశ్యం

ఉంగుటూరు: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు పిలుపునిచ్చారు. మండలంలో ప్రతి గ్రామంలో రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మహానేత పేద ప్రజలకు చేసిన మేలు, తండ్రి బాటలో నడిచిన ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంగరావు పిలుపునిచ్చారు. గ్రామాల్లో నేతలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆయన కోరారు.

దెందులూరులో..

దెందులూరు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతికి అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. దెందులూరు బస్టాండ్ సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని జిల్లా కార్యదర్శి చల్ల మేరీరాజు, సీనియర్ నాయకులు కట్టా వెంకట సుబ్బారావుతో కలిసి శుభ్రం చేశారు. అన్ని గ్రామాల్లో జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

భవిష్యత్తులో విజయం మనదే


వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో అబ్బయ్యచౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న నిర్వహించిన బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం విజయవంతమైందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించాలని, విజయం మనదేనని ఆయన పిలుపునిచ్చారు. పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

పెదపాడు: బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పనప్రసాద్ తెలిపారు. మహానేత వైఎస్సార్ 76వ జయంతి వేడుకల్లో భాగంగా దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

జెడ్పీలో ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతులు

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్లు (ఏఓ) జి.పద్మ, జి.కామేశ్వరరావులు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతులు పొందారు. జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ వారికి సోమవారం పదోన్నతులు ఉత్తర్వులు అందజేశారు. జిల్లా పరిషత్ సీఈఓ ఎం శ్రీహరి, పదోన్నతులు పొందిన ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే టీడీపీ ఆరోపణలు

- కొండలరావుపాలెం సమావేశం విజయవంతంతో ఉలిక్కిపడ్డ టీడీపీ శ్రేణులు
- అసత్య ఆరోపణలు తగదని వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపై టీడీపీ నాయకులు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని, తగదని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొండలరావుపాలెంలో జరిగిన బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమనికి అబ్బయ్యచౌదరి ఇచ్చిన పిలుపుతో వేలాది మంది తరలి రావడంతో ఒక్కసారిగా టీడీపీ నాయకులు ఉలిక్కిపడ్డారన్నారు. గతంలోనే అబ్బయ్య చౌదరి తాను ఎవరికీ బాకీ లేనని సవాల్ విసిరారని ఇప్పటి వరకు టీడీపీ శ్రేణులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కైకలూరులో చెరువులు ఎక్కడా కొట్టలేదని ఏలూరు రూరల్ మండలంలో వందలాది ఎకరాలు కక్షపూరిత వేధింపులతో నాశనం చేశారన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆరోపణలు అవాస్తవం..

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ దురుద్దేశంతో టీడీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిపై అసత్య ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. అబ్బయ్యచౌదరి ఇచ్చిన పిలుపు మేరకు వేలాది మంది సమావేశానికి తరలి రావడంతో అతనిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి పిలుపుతో సమావేశం విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వ హయాంలో దాడులు దౌర్జన్యాలు కేసులు లేవని చెప్పటం దుర్మార్గమన్నారు. సోమవారం మండల వైస్ ఎంపీపీ వేమూరు జితేంద్ర పెట్రోల్ బంకు, కారు, జీపు ధ్వంసం చేశారన్నారు. ఇది దుర్మార్గ చర్య కాదా అని ప్రశ్నించారు.

ఓర్వలేకే విమర్శలు

పెదవేగి మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట ప్రసాద్‌బాబు మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు ఓర్వలేక పలు విమర్శలు చేస్తున్నారన్నారు. ఏ ఎన్నికల్లోనూ ఇతర పార్టీతో పొత్తు లేకుండా టీడీపీ ఎప్పుడైనా అధికారంలోకి వచ్చిన చరిత్ర లేదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్రమకేసులు పెడుతున్నారన్నారు. చింతమనేని ప్రభాకర్‌పై టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కేసులు నమోదయ్యాయని ఈ విషయాన్ని ఆరోపణలు చేసిన టీడీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో దెందులూరు మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, వడ్డీలు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్లు మండల కొండలరావు, ప్రభాకర్ రావు, మాదేపల్లి గ్రామ సర్పంచ్ కొరపాటి ప్రభుదేవా, సర్పంచ్ మోషే , పార్టీ నాయకులు కృష్ణారావు, సంపంగి శ్రావణ్ తేజ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో జనరేటర్ కొరత

దెందులూరు: నియోజకవర్గ స్థాయి వైద్యశాలలో జనరేటర్ కొరత నెలకొంది. జనరేటర్ కొంత కాలంగా రిపేర్‌తో పనిచేయటం లేదు. దెందులూరులోని నియోజకవర్గ వైద్యశాలకు దాదాపు నాలుగు మండలాల నుంచి వైద్య పరీక్షలు, సేవల కోసం రోగులు వస్తారు. వైద్యశాలలోని వైద్యులు అంకిత భావంతో వైద్య సేవలు అందించడంతో రోజువారీ ఓపి 300పైగా ఉంటుంది. జిల్లా ఉన్నతాధికారులు సమస్యలను పరిశీలించి నూతన జనరేటర్‌ను నియోజకవర్గ వైద్యశాలకు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే గేట్ మూసివేత

దెందులూరు: ఏలూరు–దెందులూరు రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ నంబర్ 351489 కిలోమీటర్ల వద్ద అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రైల్వే గేటు మూసి వేస్తామని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.లోకేష్ తెలిపారు. ఏలూరు, దెందులూరు రైల్వే స్టేషన్ల మధ్య జీఎన్‌టీ రోడ్డు నుంచి నిమ్మకాయల మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారులపై ప్రయాణించే వాహనాలను ప్రత్యామ్నాయ రహదారి మీదుగా ప్రయాణించాలని ఎస్.లోకేష్ తెలిపారు.

నేడు కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొంటారు.

సమ్మెను విజయవంతం చేయాలి

గణపవరం: లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు, జిల్లా నాయకురాలు కల్యాణి పిలుపు ఇచ్చారు. సోమవారం గణపవరం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల విస్తృత సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక రక్షణ చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక లోకానికి చేటు చేయాలన్న కుయుక్తులను సమ్మె విజయవంతం చేయడం ద్వారా తిప్పి కొట్టాలని కోరారు. సమావేశంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఝాన్సీ, ఎండీ హసీనా, సీపీఎం మండల కార్యదర్శి ఎం.పెంటారావు పాల్గొన్నారు.


కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

ఫాదర్ పాస్క్వలి పునీతులు

పెదవేగి : ఇటలీ నుంచి భారతదేశానికి వచ్చి పేదలకు మరువలేని సేవలందించిన ఫాదర్ సిల్వియో పాస్క్వలి పేరు పునీతుల పుటల్లో లిఖించబడిందని ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు పేర్కొన్నారు. సోమవారం పెదవేగి మండలం పినకడిమి పవిత్ర భూమిలో సీఎస్‌ఏ సంస్థ వ్యవస్థాపకులు పాస్క్వలి 101వ వర్ధంతిని ఆ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఎస్‌ఏ అసిస్టెంట్ జనరల్ సిస్టర్ అల్ఫోన్స ఆధ్వర్యంలో స్థానిక హోలీల్యాండ్ సూపీరియర్ సిస్టర్ ఇన్యాసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఫాదర్‌లు, సిస్టర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరావు ప్రత్యేక దివ్యబలిపూజ అర్పించారు. అనంతరం భక్తులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ బాల, సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, ఇతర ఫాదర్‌లు, సిస్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


హోలీల్యాండ్‌లో ప్రత్యేక దివ్యబలిపూజ అర్పిస్తున్న బిషప్ జయరావు, గురువులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మొహర్రం పండుగ సందర్భంగా సోమవారం ఏలూరు నగరంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో పీర్ల నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లోని 15 ఆస్థానాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా ప్రతి నిత్యం ప్రత్యేక ప్రార్థనలు, దరూదె సలాం, ఫాతెహా ఖానీ నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్థానిక కుండీ సెంటర్‌లోని మౌలా అలి ముష్కిల్ కుష ఆస్థాన (గొలుసుల పంజా) పంజా వద్దకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిలపిన పీర్లను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడి నుంచి మేళతాళాలతో యువకుల నృత్యాలతో పీర్లను స్థానిక గడియార స్తంభం, మెయిన్ బజారు, బిర్లా భవన్ సెంటర్, పాత బస్టాండు ప్రాంతాల మీదుగా ఊరేగించి స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానానికి వచ్చారు. అక్కడ గన్‌బజారులోని జల్‌జలా సాహెబ్ ఆస్థానంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇమామ్ ఎ.ఖాసిం పంజా, సింగమహల్లా పంజా, లతీఫ్ తికియా ఖాదర్ జండా పంజా, అబ్బాస్ అలీ పంజా, బీబీ ఫాతిమా పంజా, గాజుల పంజా, ఏడు కాలువల సెంటర్ పంజా తదితర పంజాల్లో ఏర్పాటు చేసిన పీర్లను నిమజ్జనం చేశారు.


పీర్లను ఊరేగిస్తున్న ముజావర్లు

ఆక్రమణలను సర్వే చేయాలి

దెందులూరు: సీతమ్మ చెరువుకు వెళ్లే మురుగు బోదెలు ఆక్రమణకు గురయ్యాయని, సర్వే చేయాలని రైతు వీరమాచినేని శివాజీ తహసీల్దార్ బి.సుమతికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజా వినతుల కార్యక్రమంలో భాగంగా ఆమెకు ఫిర్యాదును అందజేశారు. మురుగు బోదెలు సర్వే చేస్తే విస్తీర్ణం పెరుగుతుందని మురుగునీరు దిగువ ప్రాంతానికి వెళ్లడం ద్వారా పొలాలకు ముంపు సమస్య శాశ్వతంగా ఉండదని రైతులకు పంట నష్టం కలగకుండా తహసీల్దార్ మురుగు బోదెలను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలన్నారు. రైతుల సాగు ప్రయోజనాలు కాపాడాలని శివాజీ ఫిర్యాదులో కోరారు.

నేటి నుంచి బీఎల్‌వోలకు శిక్షణ

ఉంగుటూరు: ఈ నెల 8 వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బీఎల్‌వోల సమావేశం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) పోతురాజు తెలిపారు. 8, 9 తేదీల్లో ఉంగుటూరు తహసీల్దార్ ఆఫీసులో, 10, 11 తేదీల్లో భీమడోలు తహసీల్దార్ ఆఫీసులో, 15వ తేదీన నిడమర్రు తహసీల్దార్ కార్యాలయంలో, 16, 17 తేదీల్లో గణపవరం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పోతురాజు వివరించారు. నియోజకవర్గం మొత్తం మీద 214 మందికి శిక్షణ ఇస్తున్నామని, బీఎల్‌వోలు అందరూ శిక్షణకు హాజరు కావాలని పోతురాజు కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లోనూ సమావేశాలు నిర్వహించాలి

పెదపాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలల్లో ఎస్ఎంసీ సమావేశం నిర్వహించాలని పెదపాడు ఎంఈఓ సబ్బితి సర్సింహమూర్తి తెలిపారు. జులై 10న నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..


ప్రమాదకరంగా మారిన అలుగులగూడెం- సీతంపేట కాలువ వంతెన

దెందులూరు: అలుగులగూడెం గ్రామంలో సీతంపేట కాలువపై ఉన్న వంతెనకు కుడి వైపు గోడ సగభాగం విరిగింది. వంతెన దిగున సీతంపేట కాలువ ప్రవహిస్తోంది. పొలాలకు వెళ్లే రైతులు ఇతర అవసరాలకు వెళ్లే అలుగులగూ డెం గ్రామస్తులు వంతెన గోడ విరగడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి విరిగిన గోడను పునరుద్ధరించాలని అధికారులను కోరుతున్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో ఈ నెల 6 నుంచి ప్రారంభమైన తొలి ఏకాదశి, గురుపౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి సాఢ సారెను భక్తి శ్రద్ధలతో భక్తులు సమర్పించారు. ఉదయం ఏకరుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. సారె సమర్పణ అనంతరం సౌందర్యలహరి, మినీ సుందర కాండ పారాయణ చేశారు. సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ, సిద్ధ మంగళ స్తోత్ర పారాయణ నిర్వహించారు. అర్చకులు దండిభొట్ల కనక సుందర శర్మ విశేష పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కోర్టు ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ & సెషన్స్ కోర్టు, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు.

జి.డబ్ల్యు.ఓ.పి.14/25

(In the matter of Guardianship of Person & Property of Minor ward **PEYYALA MELUHA MAHADEV** S/o.Avinash, D.O.B.:13.11.2019 aged 5 years)

మధ్యన :
బంగారు ప్రవంతి ....పిటీషనర్
మరియు
నిల్ .....రెస్పాండెంట్స్

పై దావా గ్రంథములో పిటీషనరు అయిన బంగారు ప్రవంతి తన ఏకైక కుమారుడు అయిన పెయ్యల మెలుహ మహాదేవ్ మైనరు అయినందున సదరు మైనర్ యొక్క ఆస్తిలోన్లపు 1/3వ వంతు ఆస్తి ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని విక్రయించుటకు శ్రీ కోర్టు వారిని పర్మిషన్ ఇప్పించమని కోరియున్నారు. సదరు పిటీషనర్ పిటీషన్ దాఖలు చేయుటలో ఎవరికైనను, ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టులో ది.31.07.2025వ తేదీన ఉదయం 10:30 గం.లకు స్వయంగా గానీ, లేదా ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి తమ అభ్యంతరములు తెలియపర్చుకొనవచ్చును.

షెడ్యూలు : ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, దెందులూరు మండలం, రామారావు గూడెం పంచాయితీ, రామారావుగూడెం గ్రామం తాలూకు ఆర్.యస్.నెం.183/1 య.0-56ట్లు, ఆర్.యస్.నెం.183/4 య.0-61ట్లు, ఆర్.యస్.నెం.183/5 య.0-20ట్లు, ఆర్.యస్.నెం.191/2ఎ య.0-33ట్లు, ఆర్.యస్.నెం.191/2బి య.0-30ట్లు వెరశి య.2-00ట్లు భూమికి హద్దులు : తూర్పు : దాసరి కుటుంబరావు, దాసరి కృష్ణ మరియు కాళి రామకృష్ణ గార్ల భూమి, పడమర : నందిగం రాంబాబు, దాసరి సూర్యనారాయణ మరియు ఇతరుల భూమి, ఉత్తరం : పెయ్యల అనూష గారి భూమి, దక్షిణం : పెయ్యల అభిలాష్ కుమార్ గారి భూమి.

యీ హద్దుల మధ్య య.2.00ట్లు భూమిన్నీ, యీ భూమికి యావత్తు యీజిమెంటు హక్కులతో సహా ఆస్తి.

(ఈ ప్రకటన కోర్టు వారు ఉత్తర్వులకు లోబడి ప్రకటించబడింది)

ఏలూరు
తేది : 07.07.2025

ఇట్లు
తంబి ప్రత్తిపాటి
అడ్వకేట్ -ఏలూరు
9666895123